సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: మరమ్మతుల కారణంగా నారపల్లిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. నారపల్లిలోని అన్ని కాలనీలు, చౌదరిగూడ, వెంకటాపూర్, కొర్రెముల గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా...

మేడ్చల్ జిల్లాలో 27.51 లక్షల మందికి కంటి పరీక్షలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్‌తో కలెక్టర్ హరీశ్



సాక్షి,మేడ్చల్ జిల్లా: కంటివెలుగు రెండో విడతలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 27,51,810 మందిని గుర్తించామని, వారిందరికీ కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరీష్ తెలిపారు. కంటి పరీక్షల నిర్వహణకు సంబంధించి 480 ప్రాంతాల్లో 79 బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర మంత్రి హరీష్‌రావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజన్‌కుమార్, హెల్త్ కమిషనర్ శ్వేతలతో ఆయన మాట్లాడారు. కంటి వెలుగుకు సంబంధించి ముందస్తు ప్రణాళికను తయారు చేసి ఎక్కడ శిబిరాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని ఒకరోజు ముందుగానే ప్రజలకు తెలిసేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కంటి వెలుగు విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి వేణుగోపాల్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు'



దేవేందర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు

జవహర్‌నగర్: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కాప్రా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ హెచ్చరించారు. సోమవారం జవహర్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను ఆయన తొలగింపజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను కూల్చివేస్తామన్నారు. ఎన్నిసార్లు హెచ్చరించినా కొందరు కబ్జాదారులు పట్టించుకోవడంలేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెడతామన్నారు. ఈ మేరకు సర్వే నంబర్.585, 586, 591, 592లలో వెలసిన నిర్మాణాలను కూల్చివేసినట్లు ఆయన తెలిపారు.

30న భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌లోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం ఈనెల 30న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 29న సాయంత్రం 4గంటలకు స్వామి, అమ్మవార్లను గంగకు తీసుకువెళ్లుట, 30న మధ్యాహ్నం 3గంటలకు స్వామివారి కల్యాణం, బోనాల ఊరేగింపు, గొలుసు తెంపుట, అగ్గిగుండం దాటుట, రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజాము వరకు కళాకారులతో ఒగ్గు కథ, 31వ తేదీ ఉదయం నాగవెళ్ళి తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్ల దీవెనలు పొందాలని ఆలయ కమిటీ కోరింది.

సంక్రాతి పండుగ సందర్భంగా శామీర్‌పేట మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో విజేతలకు సీఐ సుధీర్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు ఇస్తున్న కిషోర్‌యాదవ్.
– శామీర్‌పేట్



ఆర్థిక లబ్ధి కోసం అవిశ్వాసం!

పోచారం పురపాలక సంఘంలో అభివృద్ధి పక్కనబెట్టి స్వలాభం చూసుకుంటున్న పాలకులు!

- పదవుల కోసం డబ్బు పెట్టేందుకు సిద్ధం
- మూడేళ్ల ప్రస్థానంలో ఎన్నో మలుపులు
- 'ధనం మూలం ఇదం జగత్' బాటలో ప్రజాప్రతినిధులు



పోచారం: విధానపరమైన లోపాలతో జరిపే పాలనకు మనుగడ ఉండదు. రాజనీతి లోపిస్తే.. ప్రజలు ఎన్ని విధాలుగా ఇబ్బందులు పడతారో ప్రస్తుత పరిస్థితులే అందుకు అద్దం పడుతున్నాయి. పోచారం పురపాలక సంఘ పాలకవర్గం కొలువు దీరి మూడేళ్లవుతోంది. ఈ మూడేళ్ల ప్రస్థానంలో ఎన్నో మలుపులు చోటు చేసుకున్నాయి. 'ధనం మూలం ఇదం జగత్' అన్న సూక్తిని అనుసరించి ఆర్థిక లబ్ధి కోసం చైర్మన్‌తో పాటు వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కొందరు కౌన్సిలర్లు రంగం సిద్ధం చేశారు. ఇదే అదునుగా తీసుకుని డబ్బు వెచ్చించి పదవులు పొందాలని మరి కొందరు వ్యూహరచన చేస్తున్నారు.

కరోనాతో కష్టాల కడలి..

పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసిన మూడు నెలలకే కరోనా మహమ్మారి కరాళ నృత్యం చేసింది. ఈ తరుణంలో జనజీవనం స్తంభించింది. మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం గణనీయంగా తగ్గింది. కౌన్సిల్ సర్వసభ్య సమావేశాల్లో జాప్యం జరిగింది. తెలంగాణ మున్సిపల్ చట్టం ప్రకారం నెలకోసారి కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం లేదంటూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించక పోవడంతో ఓ కౌన్సిలర్ కోర్టును ఆశ్రయించడం జరిగింది. చైర్మన్‌ను తొలగించాలని కోరడం.. విచారణ.. వివరణ.. సిఫార్సు.. వంటి అంశాలు అనుకూలించడంతో గండం తప్పింది.

తలనొప్పిగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు..

మున్సిపాలిటీ పరిధిలోని పలు పార్కులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురైన అంశం పలు సమావేశాల్లో చర్చకు వచ్చింది. అన్నోజిగూడలోని సర్వే నంబర్.14, 3/1లోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేయడంతో ఎట్టకేలకు సర్వే నంబర్.14లో ఏడీ సర్వే నిర్వహించారు. అదేవిధంగా ఇప్పటి వరకు గుర్తించిన 75 పార్కు స్థలాల రిజిస్ట్రేషన్లను, ఎల్ఆర్ఎస్‌లను రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులకు లేఖలు పంపారు. ఇంకొన్ని పార్కులను అధికారులు గుర్తించాల్సి ఉంది.

నిధుల కేటాయింపులో అసమానతలు..

మున్సిపాలిటీలోని 18 వార్డులకు నిధుల కేటాయింపులో అసమానతలు చోటుచేసుకునేవి. దీంతో సమానంగా నిధులు కేటాయించాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేయడంతో ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ కొందరు కౌన్సిలర్లు అసంతృప్తిగానే ఉన్నారు.

వ్యూహాత్మకంగా ఇండిపెండెంట్లు..

ఇండిపెండెంట్‌గా గెలిచిన కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరి వ్యూహాత్మకంగా వ్యవహరించి వారివారి వార్డుల అభివృద్ధి, ఆర్థిక లబ్ధితో పాటు రాజకీయ భవిష్యత్తుపై దృష్టి పెట్టారు. అధికార పార్టీ అండదండలే వీరికి కలిసొచ్చింది. బీఆర్ఎస్ కౌన్సిలర్ల అసంతృప్తికి హేతువైంది.

ప్రశ్నార్థకంగా ప్రత్యామ్నాయం..

ప్రస్తుత చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డికి ప్రత్యామ్నాయం ఇప్పటి పాలకవర్గంలో కష్టసాధ్యమే. కానీ చైర్మన్ కుర్చీ ఆశించి కౌన్సిలర్ల మద్దతు కూడగట్టేందుకు భారీగా డబ్బు పంపిణీ చేసేందుకు ఓ కౌన్సిలర్ కసరత్తు చేస్తున్నాడు. ఇదే అదునుగా భావించి.. ఆర్థికంగా లాభపడాలనుకునే కౌన్సిలర్లు అవిశ్వాసం దిశగా అడుగులు వేస్తున్నారు. ఇండిపెండెంట్‌గా గెలిచి బీఆర్ఎస్ తీర్థం తీసుకున్న మరో కౌన్సిలర్ వైస్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. దీంతో ప్రస్తుత వైస్ చైర్మన్ రెడ్యానాయక్ పదవి త్యాగం చేయక తప్పదన్న సంకేతాలు వస్తున్నాయి.

పార్టీల వారీగా కౌన్సిలర్లు..

ఎన్నికల ద్వారా గెలిచిన 10 మందితో పాటు ఏకగ్రీవంగా ఎన్నికైన ఇద్దరు అభ్యర్థులతో కలిపి మొత్తం 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉన్నారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ కౌన్సిలర్ ఒకరు, ఇండిపెండెంట్లు నలుగురు బీఆర్ఎస్‌లో చేరడంతో వీరి సంఖ్య 17కు చేరింది. బీజేపీ కౌన్సిలర్ ఒకరు కౌన్సిల్‌లో ఉన్నారు. బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పది రోజుల క్రితమే కౌన్సిలర్లు, పార్టీ నాయకులు సమావేశమై ఈ నెల 25వ తేదీ తర్వాత అవిశ్వాసం వస్తే ఎలా గట్టెక్కాలనే అంశంపై చర్చించారు.

'5 కిలోల రేషన్ బియ్యం రాష్ట్రమే ఇస్తుందనడం సిగ్గుచేటు'



ఎదులాబాద్ రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం నెలకు 5 కిలోల బియ్యం ఉచితంగా అందజేస్తుంటే 'సొమ్మొకరిది సోకొకరిది' అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందంటూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఎదులాబాద్ రేషన్ దుకాణాన్ని సోమవారం సందర్శించిన ఆయన మాట్లాడుతూ... అంగన్‌వాడీ, పాఠశాలలు, డంపింగ్‌యార్డ్, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, రైతు వేదికల నిర్మాణాలకు కేంద్రమే నిధులు అందజేస్తుందన్నారు. కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ కార్యకర్తలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కుమార స్వామి, వార్డు సభ్యులు ఆంజనేయులు ముదిరాజ్, సురేశ్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, లింగం, శంకర్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రిమాండ్‌కు గంజాయి విక్రేత

శామీర్‌పేట్: అనుమానాదస్పదంగా తిరుగుతున్న యువకుడిని పోలీసులు విచారించగా అతడి వద్ద రెండు కేజీల గంజాయి లభ్యమైన ఘటన శామీర్‌పేట్‌లో చోటు చేసుకుంది. సీఐ సుధీర్‌కుమార్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు గ్రామానికి చెందిన కురుమ నాగేశ్(19) గత నాలుగు నెలల నుంచి తుర్కపల్లిలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. కాగా సోమవారం తెల్లవారుజామున శామీర్‌పేట్ బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆ సమయంలో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు నాగేశ్‌ను విచారించారు. దీంతో అతడి వద్ద రెండు కేజీల గంజాయి లభ్యం కావడంతో అదుపులోకి తీసుకుని స్టేషన్ తరలించారు. పూర్తి వివరాల కోసం విచారణ జరపగా తాను పనిచేస్తున్న ప్రాంతంలో విక్రయించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నర్సీపట్నంలో నాలుగు రోజుల క్రితం గంజాయి కొనుగోలు చేసినట్లు నిందితుడు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని సోమవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం



శ్రీ గోదాదేవి రంగనాయక స్వామి కల్యాణ వేడుక

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ శ్రీ మన్నారు రంగనాయక స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి రంగనాయక స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఉత్సవ విగ్రహాలను అందగా అలంకరించి ప్రత్యేక వేదికపై ప్రతిష్ఠించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ వేడుకలు నిర్వహించారు. స్థానిక భక్తులే కాకుండా నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. వేడుకల్లో యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ఈఓ గీతారెడ్డి, ఎదులాబాద్ ఆలయ ధర్మకర్తలు పురుషోత్తమాచార్యులు, అనంతసేనాచార్యులు, పవనాచార్యులు, అచ్యుతాచార్యులు, శ్రీవత్సాచార్యులు, శేనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ మండల బాధ్యుడు అరుణ్‌కుమార్ అన్నారు. పూలమాల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాల సమర్పించారు. కార్యక్రమంలో బాలయ్య, రాందాస్, శ్రీనివా స్, రాజేశ్‌కుమార్, నర్సింగ్ రావు, సత్యనారా యణ, హరికృష్ణ, జంగయ్య, సురేశ్, చందు, రాకేశ్, భరత్, అనుశ్, కార్తీక్, గణేశ్, జంగయ్య, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్త జనసంద్రం.. క్షేత్రగిరి ప్రాంగణం



క్షేత్రగిరిపై భక్తుల జనసందోహం



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి మల్లారెడ్డి

- ఘనంగా క్షేత్రగిరి వెంకన్న జాతర
- శ్రీవారిని దర్శించుకున్న మంత్రి మల్లారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలం ఘనాపూర్, రాజబొల్లారం గ్రామాల పరిధిలోని క్షేత్రగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులతో క్షేత్రగిరి భక్త జనసంద్రంగా మారింది. ప్రతీ ఏటా సంక్రాంతి మరుసటి రోజైన కనుమ రోజున క్షేత్రగిరిపై జాతర నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం జాతర సందర్భంగా ఉదయాన్నే ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. జాతరలో పాల్గొనేందుకు మేడ్చల్, శామీర్‌పేట్ మండలాలతో పాటు నగరవాసులు, మెదక్, సిద్దిపేట్, నల్లగొండ జిల్లాల నుంచి వేలా సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు కుటుంబ సమేతంగా జాతరకు విచ్చేసి సాయంత్రం వరకు గుట్టపై ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా గడిపారు. వేలా సంఖ్యలో భక్తులు రావడంతో గోవింద నామస్మరణతో క్షేత్రగిరి మార్మోగింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో మేడ్చల్, శామీర్‌పేట్‌లతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో క్షేత్రగిరిపై పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

వేడుకలో మంత్రి మల్లారెడ్డి...

క్షేత్రగిరి జాతర మహోత్సవాల్లో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్‌తో కలిసి మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ, అర్చకులు వారిని సన్మానించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు. ఈ వేడుకలో వైస్ ఎంపీపీ వెంకటేశం, ఎంపీటీసీ అంకిత, ఉపసర్పంచ్ నారాయణగౌడ్, నాయకులు రాజమల్లారెడ్డి, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

భూమి ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ.. కిరోసిన్ బాటిల్‌తో 'ప్రజావాణి'కి హాజరు



కలెక్టరేట్‌లో ఆందోళనకారులను అడ్డుకుంటున్న సిబ్బంది



ఆత్మహత్యకు పాల్పడిన రైతు భూక్యా గంగారామ్

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూకబ్జాపై ఫిర్యాదు చేయటానికి కిరోసిన్‌తో వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి రైతుల్లో ఓ రైతు భూక్యా గంగారామ్ నాయక్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. మేడ్చల్ మండలం రాజబొల్లారం గ్రామానికి చెందిన భూక్యా స్వామి నాయక్, భూక్యా చంద్రు నాయక్, భూక్యా హనుమాన్ నాయక్ తదితర కుటుంబ సభ్యులకు ఇదే గ్రామంలో సర్వే నం.207లో 18.05 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని అదే గ్రామానికి చెందిన ప్రేమ్‌నాయక్‌తో సహా వారి సంబంధితులకు కౌలుకు ఇచ్చి పక్కనున్న యాదాద్రి–భువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెం తండాకు కుటుంబ సభ్యులతో వలస వెళ్లారు. అయితే కొన్నాళ్ల తర్వాత భూక్యా స్వామి నాయక్, భూక్యా చంద్రు నాయక్, భూక్యా హనుమాన్‌నాయక్ కుటుంబ సభ్యులైన భూక్యా గంగారామ్ నాయక్, భూక్యా రెట్యానాయక్, భూక్యా మంగ్యానాయక్ రాజబొల్లారం గ్రామానికి వెళ్లి చూసే సరికి తమ భూమిలో కౌలుకు ఇచ్చిన వారు కాకుండా ఇతరులు కబ్జాలో ఉన్నారు. ఇదేంటని వారిని ప్రశ్నిస్తే.. తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. తమ భూమిలో కబ్జాలో ఉన్నవాళ్లు రికార్డులను కూడా తారుమారు చేశారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని మేడ్చల్ కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారు తమ భూమిని కొందరు ఆక్రమించారని నిరసన వ్యక్తం చేస్తుండగానే.. అందులో భూక్యా గంగారామ్ నాయక్ అనే రైతు తన వెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను సమీపంలోని బాత్ రూమ్ వద్ద వెళ్లి ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. తమ ఫిర్యాదును కలెక్టరేట్‌లో ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇది గమనించిన స్థానికులు, మిగిలిన కుటుంబ సభ్యులు, కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు అడ్డుకుని భూక్యా గంగారామ్ నాయక్‌ను శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం మధ్యాహ్నం వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచుకున్న పోలీసులు.. ఆ తర్వాత భూక్యా గంగారామ్‌నాయక్‌కు అన్ని విధాలుగా కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు 186 కింద కేసు నమోదు చేసి వదలిపెట్టారు.

పరిష్కారం మా పరిధిలో లేదు..

మేడ్చల్ మండలం రాజబొల్లారం గ్రామానికి చెందిన 207 సర్వే నంబర్‌లోని భూసమస్య తమ కలెక్టరేట్ పరిధికి రాదు. దాదాపు 40 ఏళ్ల కిందటి ఈ భూసమస్యను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. 1984–85 నుంచి 207 సర్వే నంబర్‌లోని 18.05 ఎకరాల భూమి జోన్నాడ వినాయకరావు తదితరులపై రిజిస్ట్రేషన్ అయి ఉంది. వారికి ఎవ్వరు రిజిస్టర్ చేశారన్న విషయం పరిశీలించాల్సి ఉంది. దీనికి ముందు ఈ భూమి అముర్యా నాయక్ పేరుపై ఉన్నట్లు తెలుస్తోంది. వీరు ఒక వ్యక్తికి కౌలుకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ధరణిలో మాత్రం అగర్వాల్ పేరుపై భూమి ఉన్నట్లు సమాచారం.
– ఏనుగు నర్సింహారెడ్డి, అదనపు కలెక్టర్

భూమిపై కరపత్రం కలకలం..

'రాజబొల్లారంలో కంచె చేను మేసింది' అన్నట్లుగా సదరు భూమిపై కరపత్రం ముద్రించి కలెక్టరేట్‌లో పంపిణీ చేయడం కలకలం రేపింది. కొందరు వ్యక్తులు నకిలీ వారసత్వం, దస్తావేజులు సృష్టించి రూ.వంద కోట్లు విలువ చేసే ఈ భూమిని కాజేసుకున్న పలువురు వ్యక్తులు రూ.వంద కోట్లకు అమ్ముకున్నారని కరపత్రంలో పేర్కొన్నారు. అలాగే భూమికి సంబంధించిన వారసులను చంపాలని సుపారీతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సమితి పేర్కొంది. ఈ కరపత్రంలో ఎవరి పేర్లు లేకపోయినప్పటికీ ఫోన్ నంబర్లు మాత్రం వేశారు.
– గిరిజన పరిరక్షణ సమితి, బంజారావాసి హక్కుల పోరాట సమితి

ప్రజావాణిలో 25 ఫిర్యాదులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వినతులు, దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులు సత్వరమే వాటిని పరిష్కరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి వచ్చిన 25 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు అక్కడికక్కడే పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కైట్ ఫెస్టివల్‌లో చైర్మన్ కొండల్‌రెడ్డి

సందడిగా సంక్రాంతి

మేడ్చల్ నియోజకవర్గంలో మకర సంక్రాంతి వైభవం

- రంగవల్లులతో ఆకట్టుకున్న వాకిళ్లు
- అలరించిన హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు
- గగనంలో గాలిపటాల విహారం

'హరిలో రంగ హరీ' అంటూ.. హరిదాసు కీర్తనలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. గొబ్బెమ్మల అందాలు.. చిన్నారుల కేరింతలు.. ఆకాశంలో గాలిపటాల సందడి.. అమ్మానాన్నలు, అన్నావదినల ఆప్యాయతలు... కొంటె మరదళ్ల అల్లరి చేష్టలతో ఆదివారం సంక్రాంతి పర్వదిన వేడుకలు మేడ్చల్ నియోజకవర్గంలో సంబరంగా జరిగాయి. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే మహిళలు తమ ఇంటి వాకిళ్లను శుభ్రంగా చేసుకుని పోటాపోటీగా రంగోలీ ముగ్గులను వేసి తలస్నానాలు ఆచరించి గొబ్బెమ్మలను ప్రతిష్ఠించారు. అనంతరం ఇంటికి వచ్చిన కొత్త ధాన్యాలను తమ తమ ఇష్ట దేవుళ్లకు నైవేద్యంగా సమర్పించి కొత్త సంవత్సరంలో పాడి పంటలతో మంచి దిగుబడులు రావాలని వేడుకున్నారు. మరికొందరు కనుమ లక్ష్మి అమ్మవారికి ఇళ్లల్లో ప్రతిష్ఠించి నోములు జరుపుకున్నారు. అదేవిధంగా పిండి వంటలు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు ఆరగిస్తూ ఆనందంగా గడిపారు. పిల్లలు, యువత గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. – మేడ్చల్ జోన్ బృందం



జవహర్‌నగర్‌లోని తన నివాసంలో బసవన్నతో మేయర్ కావ్య



గాలిపటం ఎగురవేస్తున్న కీసర సర్పంచ్ మాధురి



కీసరలోని నందినగర్‌కాలనీలో చక్కటి ముగ్గులు వేసిన మహిళలకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న నల్లవెంకట్‌రెడ్డి



పూడూర్‌లో గాలిపటాలు ఎగురవేస్తున్న యువకులు, చిన్నారులు